నేటి దినపత్రిక
సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం | 25 డిసెంబర్ 2024 | పేజీలు 8

# బిల్డర్లు, సివిల్ ఇంజనీర్లతో అదనపు కమిషనర్ సమీక్ష




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సచివాలయ కార్యదర్శులు, లైసెన్స్ టెక్నికల్ పర్సన్లు, బిల్డర్లు, సివిల్ ఇంజనీర్లతో అదనపు కమిషనర్ నందన్ మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించి డ్రాఫ్టింగ్ జీవోను చదివి వినిపించారు. జనవరి 1వ తేదీ నుంచి పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి నూతన విధివిధానాలను నిర్దేశిస్తూ రానున్న జీవోకు సంబంధించి అభ్యంతరాలు, సలహాలు, సూచనలు ఉంటే నేరుగా కార్యాలయంలో కానీ, లేదా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చని అదనపు కమిషనర్ సూచించారు. సమావేశంలో సిటీ ప్లానర్ హిమబిందు, అసిస్టెంట్ సిటి ప్లానర్లు వేణు, ప్రకాష్, సచివాలయ వార్డు ప్లానింగ్ కార్యదర్శులు, ఎల్‌టీపీలు, సివిల్ ఇంజనీర్లు, బిల్డర్లు పాల్గొన్నారు.





# ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

## మంత్రి నారాయణ

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర, జిల్లా ప్రజలకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. 'దైవ కుమారుడు జీసస్ మానవునిగా జన్మించిన రోజును ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ పండుగగా జరుపుకుంటున్నామని, ఏసుప్రభువు జీవనం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. తన బోధనల ద్వారా మానవాళిని సన్మార్గం వైపు నడిపించేలా మార్గనిర్దేశం చేశారని, నిస్సహాయులపై కరుణ, సాటివారిపై ప్రేమ, క్షమా, సహనం, దాతృత్వం, త్యాగం.. ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించిన మహోన్నత సందేశాలు ఉన్నాయన్నారు. ఎల్లప్పుడూ ఆ కరుణామయుని ఆశీస్సులు, దీవెనలు ప్రజలకు ఉండాలని మంత్రి ఆకాంక్షించారు.





# 27న విద్యుత్ చార్జీలపై పోరుబాట

## మాజీ మంత్రి కాకాణి వెల్లడి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

విద్యుత్ చార్జీల పెరుగుదలకు నిరసనగా ఈనెల 27న వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పోరుబాటకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలను పెంచబోమని చెప్పిన చంద్రబా బు, ప్రస్తుతం ఇష్టారాజ్యంగా విద్యుత్ ఛార్జీలను పెంచుతున్నారని విమర్శించారు. నెల్లూరు జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్చార్జి, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, ఉదయగిరి నియోజకవర్గ ఇన్చార్జి మేకపాటి రాజగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# జీసస్ ఆశీస్సులతో ప్రజలు సంతోషంగా ఉండాలి

## ఎంపీ వేమిరెడ్డి

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** కరుణ, క్షమ, ప్రేమ, సహనం, దయాగుణం ప్రజలకు ఏసుక్రీస్తు తన జీవితం ద్వారా అందించిన మహోన్నత విలువలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం క్రిస్మస్ సందర్భంగా జిల్లా ప్రజలకు, క్రిస్టియన్ సోదరులకు, కూటమి నాయకులకు, కార్యకర్తలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. బాధల్ని ఓర్చుకుని తనను నమ్మిన ప్రజల కష్టనష్టాల్లో భాగం పంచుకుని ప్రాణత్యాగం చేసిన ఏసుక్రీస్తు జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. సాటి మనిషికి చేతనైనంత సాయం, పొరుగువారిపై ప్రేమ, ప్రతికార్యంలోనూ త్యాగం ఆయన చూపిన బాట అని, ప్రతి ఒక్కరూ క్రీస్తుబాటలో పయనించి సుఖ సంతోషాలతో జీవించాలన్నా రు. క్రీస్తు బోధనలు ఎప్పటికీ ఆచరణీయమని, ఆయన కృప, కరుణ అందరిపై ఉండాలని ఎంపీ ఆకాంక్షించారు.



## మాతా, శిశు మరణాలు జరగకుండా..

# జాగ్రత్తలు వహించండి

## జిల్లా కలెక్టర్ ఆనంద్

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

మాతా, శిశు మరణాలు జరగకుండా వైద్య ఆరోగ్య సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అన్నారు. మంగళవారం సాయంత్రం తిక్కన ప్రాంగణంలో మాతా, శిశు మరణాలపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో గత మూడు నెలల్లో మూలాపేటకు చెందిన మాధవి, కోవూరుకు చెందిన మునిరత్నమ్మల మెటర్నల్ డెత్ జరగడంతో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో పీహెచ్‌సీ, సీహెచ్‌సీ డాక్టర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లతో కలెక్టర్ సమీక్ష చేశారు. మరణాలకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యం వల్ల మాతా, శిశు మరణాలు సంభవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆరోగ్యశ్రీ సదుపాయం ఉన్న మాధవిని అడ్మిట్ చేసుకోకుండా జీజీహెచ్‌కి రిఫర్ చేయడంపై ఒక ప్రైవేటు వైద్యశాల అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తగిన విచారణ చేయాలని ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్‌ను ఆదేశించారు. -మిగతా 2లో

# సమాజం దైవ సన్మార్గంలో నడవాలి

- వక్ఫ్ బోర్డ్ చైర్మన్, షేక్ అబ్దుల్‌అజీజ్
- టీడీపీ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు




**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నగరంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏపీ వక్ఫ్‌బోర్డ్ చైర్మన్, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డిలు పాల్గొన్నారు. ముందుగా చిన్నారుల నృత్యాలు, దేవుని పాటలు, డేవిడ్ పాస్టర్ ఉపన్యాసంతో, -మిగతా 2లో

# వినియోగదారులకు హక్కులపై అవగాహన ముఖ్యం






**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నేటి సాంకేతిక యుగంలో వినియోగదారులకు తమ హక్కుల గురించి అవగాహన ఎంతో ముఖ్యమని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ అన్నారు. మంగళ వారం జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశం హాలులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ జిల్లా అధ్యక్షులు రెడ్డి శేఖర్‌తో కలసి వినియోగదారుల హక్కుల గురించి నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన పాఠశాల విద్యార్థులకు జాయింట్ కలెక్టర్ నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ఈ సంవత్సరం జాతీయ వినియోగదారుల దినోత్సవానికి 'వినియోగదారు న్యాయ పాలనకు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం' అనే ఇతివృత్తాన్ని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రోజురోజుకి పెరుగుతున్న డిజిటల్ కొనుగోళ్లలో వినియోగదారులు మోసపోకుండా ఉండటమే కాకుండా, తమ హక్కుల గురించి గుర్తెరగాలన్నారు. ముఖ్యంగా డిజిటల్ అక్షరాస్యత లేని పెద్దవారు ఆన్‌లైన్ కొనుగోళ్లలో జాగ్రత్త లు వహించాలన్నారు. ఆన్‌లైన్ చెల్లింపులలో బాధితులు పెద్దవయసు వారే అధికంగా ఉంటున్నందున, యువత చొరవ తీసుకుని తమ తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలన్నారు. మొబైల్‌లో చెల్లింపుల యాప్‌లను ఉపయోగించుకునే విధానంలో 2 లేదా 3 అంచెల బలమైన, ప్రత్యేకమైన పాస్‌వర్డ్‌ను పెట్టుకోవాలన్నారు. అదేవిధంగా బహిరంగ ప్రదేశాల్లో ఉచితంగా అందజేసే వైఫై ద్వారా ఆన్‌లైన్ కొనుగోళ్లు, చెల్లింపుల యాప్‌లను ఉపయోగించడం శ్రేయస్కరం కాదన్నారు. అదేవిధంగా ఈ కామర్స్ మోసాలు గురించి కనీస అవగాహన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు. అతి తక్కువ ధరకే వస్తువులు లభ్యమన్న ఈ కామర్స్ వెబ్ సైట్స్ పట్ల జాగ్రత్త వహించాలన్నారు. ఖరీదైన వస్తువులను ఆన్‌లైన్ ద్వారా కొనేటప్పుడు సాధ్యమైనంతవరకు క్యాష్ ఆన్ డెలివరీ ఆప్షన్‌ను ఎంచుకోవాల్సిందిగా సూచించారు. వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ జిల్లా అధ్యక్షులు రెడ్డి శేఖర్ మాట్లాడుతూ.. వినియోగదారులకు సేవాలోపం జరిగితే కేసు వేయవచ్చుననే అవగాహన ముఖ్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెస్తున్నప్పటికీ, సమాజంలో సరైన అవగాహనతోనే మెరుగైన ఫలితాలు సాధించవచ్చునన్నారు. వర్చువల్ విచారణ సత్వర న్యాయానికి అనుకూలమన్నారు. కోర్టులకు హాజరవడం కోసం దూర ప్రయాణాలు చేయాల్సిన అవసరం లేకుండా సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతాయన్నారు. సమావేశంలో డీఎస్‌ఓ వెంకట రమణ, జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షులు శ్రీనివాసులు, ఫుడ్ సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, తూనికలు కొలతలు శాఖ డిప్యూటీ కొంట్రోలర్ ఐజాక్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కీర్తి, వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన మేయర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** ప్రేమాభావం, సేవాతత్పరత, క్షమా గుణాన్ని బోధించిన యేసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని నగరపాలక సంస్థ మేయర్ స్రవంతి జయవర్ధన్ ఆకాంక్షించారు. నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలకు, కార్పొరేషన్ అన్ని విభాగాల అధికారులకు, సిబ్బందికి, క్రైస్తవ సోదరులందరికీ క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు ఆమె తెలిపారు.

## జిల్లా ప్రజలకు కలెక్టర్ క్రిస్మస్ శుభాకాంక్షలు



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ ఆనంద్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, సేవాతత్పరత, క్షమా గుణాన్ని బోధించిన ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరు కూడా క్రీస్తు జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని నిజాయితీగా జీవించాలని, అందరం కలిసి మెలిసి ఐక్యత చాటుకుంటూ సమాజంలో స్ఫూర్తివంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. జిల్లా ప్రజలందరిపై ఏసుక్రీస్తు ఆశీస్సులు మెండుగా ఉండి ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

### క్రిస్మస్ శుభాకాంక్షలు : జేసీ కార్తీక్

జిల్లా ప్రజలకు జాయింట్ కలెక్టర్ కార్తీక్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, క్షమాపణ, దయ, శాంతి, సహనం వంటి సద్గుణాలతో ప్రతి ఒక్కరు కూడా క్రీస్తు చూపిన సన్మార్గంలో పయనించాలని జాయింట్ కలెక్టర్ పిలుపునిచ్చారు.

# శత్రువునైనా ప్రేమించగల కరుణామయుడు యేసుక్రీస్తు

- శాంతి, సహనమే క్రీస్తు మార్గం
- మరణం లేని నిత్య సజీవుడు యేసుక్రీస్తు
- క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు
- చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మురళి




**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** యేసు ప్రభువు బోధించిన శాంతి, సహనం, పరోపకారం అనే సద్గుణాలు సదా ఆచరణీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మురళి పేర్కొన్నారు. పట్టణంలోని రెయిన్‌బో స్కూల్లో నిర్వహించిన ప్రీ క్రిస్మస్ వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం క్రైస్తవ పెద్దలు ఆత్మీయ స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. రెయిన్‌బో స్కూల్ చిన్నారులతో కలిసి ఆమె కేక్ కట్ చేసి క్రైస్తవులకు ప్రీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మురళి మాట్లాడుతూ.. దయామయుడైనా యేసు జన్మదిన వేడుకలకు సంబంధించిన ఆధ్యాత్మిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానించిన రెయిన్‌బో యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు. మతాల కన్నా మానవత్వం గొప్పదని, ప్రతి ఒక్కరు పరమత సహనంతో పరస్పర ప్రేమా భిమానాలతో జీవనం సాగించాలని కోరారు.

## సమాజం దైవ సన్మార్గంలో నడవాలి



(మొదటి పేజీ తరువాయి)

ఊరందూరు సురేంద్రబాబు అధ్యక్షతన కార్యక్రమం సాగింది. క్రిస్మస్ సందర్భంగా కేక్ కటింగ్ నిర్వహించారు. అనంతరం 60 మంది పాస్టర్లకు డిన్నర్ సెట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నా, లేకున్నా దశాబ్ద పైకాలంగా నగరంలోని దైవజనుల సమక్షంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు జరుపుతూనే ఉన్నానని తెలియజేశారు. బైబిల్, వేదాలు, ఖురాన్ ఏది చెప్పినా అది మనమంతా ఒకరి బిడ్డలమే అని చెబుతుందన్నారు. బైబిల్ ఒకరి కోసం పుట్టింది కాదు.. జనులందరికీ సన్మార్గాన్ని నేర్పుతుందన్నారు. బైబిల్ 22వ అధ్యాయం 37 నుంచి 39లో పొరుగువారిని మనలానే ప్రేమించాలని ఉందన్నారు. యోహాను ఎనిమిదో అధ్యాయంలో యేసు మార్గంలో నడిచేవాడే క్రైస్తవుడు అని ఉందన్నారు. అంధకారం అంటే అజ్ఞానం, నరకం. ఏసుప్రభువు మార్గంలో నడిస్తే అంధకారం నుంచి బయటపడతారన్నారు. ఇదే సూక్తిని వేదాలు, ఖురాన్ కూడా చెబుతున్నాయన్నారు. వారాలలో దేవుళ్లను గుర్తు చేసుకోవడం కాదు, సమాజంపై బాధ్యతతో వారి మార్గాన్ని అనుసరించాలని, రాజులంటే పాలించేవారు, రాజులను తిట్టడం తప్ప వారి కోసం ప్రార్ధన చేసిన వారే లేరన్నారు. పాలించేవారికి మంచి జ్ఞానాన్ని ప్రసాదించమని ప్రార్థించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పీఎల్ రావు, మామిడాల మధు, పెంచల నాయుడు, సాబీర్ ఖాన్, గంగాధర్, భరత్ కుమార్, పొత్తూరి శైలజ, కొమరి విజయ, రేవతి, శ్రీదేవి, రసూల్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

# మాతా, శిశు మరణాలు జరగకుండా జాగ్రత్తలు వహించండి

(మొదటి పేజీ తరువాయి)


వైద్య సిబ్బందికి సలహాలు, సూచనలు చేస్తున్న మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఎన్ఎం, ఆశా వర్కర్, సంబంధిత మెడికల్ ఆఫీసర్లపై తగిన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓకు ఆదేశాలు ఇచ్చారు. ప్రసవాల కోసం ఆసుపత్రులకు వచ్చే హైరిస్క్ కేసులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పీహెచ్‌సీ స్థాయిలో హైరిస్క్ కేసులుగా గుర్తించిన వాటిని నూరు శాతం జీజీహెచ్‌లో డాక్టర్లకు చూపించి పరీక్షలు చేయించాలన్నారు. ప్రసవం సమయంలో డాక్టర్‌ల సూచనలు పాటిస్తూ.. ఆసుపత్రులలో చేరే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. ఆసుపత్రిలో చేరిన దగ్గర నుండి డిశ్చార్జి అయ్యేవరకు ఆశాలు, ఏఎన్ఎంలు.. వారు ఎలా ఉన్నారో తెలుసు కోవాలాన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ సుజాత, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్ వలీ, జీజీహెచ్ సియర్ గైనకాలజిస్ట్, పీహెచ్సీ డాక్టర్లు, పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఆదేశాలతో ఫ్లెక్సీల తొలగింపు

## సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన జలదంకిలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అడ్డదిడ్డంగా పలు పార్టీల నేతలు ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఇబ్బంది కలిగే విధంగా ఉన్నాయి. అయితే ఈ విషయం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి రాగా.. ఇటీవల పలుమార్లు తన ఫ్లెక్సీలు ఉన్నా కూడా, ప్రయాణికుల సౌలభ్యం చూడాలంటూ ఫ్లెక్సీలన్నింటినీ తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఆయన ఆదేశాలు పట్టించుకోకుండా ఎమ్మెల్యే ఫ్లెక్సీలు కూడా ఉండడంతో తీస్తే ఏమవుతుందోనన్న ఉద్దేశంతో అధికారులు తొలగింపు కార్యక్రమం చేపట్టలేదు. ఇటీవల జలదంకి సచివాలయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల పంచాయతీ సెక్రటరీకి వార్నింగ్ ఇచ్చారు. ఎన్నిసార్లు చెప్పినా అధికారుల తీరు మారలేదంటూ హెచ్చరించారు. దీంతో బుధవారం ఎట్టకేలకు ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఈ విషయంపై ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యే తీరును ప్రశంసిస్తున్నారు.

## క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి ఆనం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** కరుణామయుడు, లోక రక్షకుడు ఏసుప్రభువు జన్మించిన పర్వ దినం క్రిస్మస్ వేడుకలను రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆనందంగా జరుపుకోవాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆకాంక్షించారు. క్రిస్మస్‌ను పురస్కరించుకొని క్రైస్తవులందరికీ మంత్రి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. శాంతి, దయ, ప్రేమ, ధర్మం, న్యాయం, అహింస, పరోపకారం వంటి ఏసు క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆచరణీయమని, క్రీస్తు చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ పయనిస్తూ ఉన్నతమైన జీవితాన్ని కొనసాగించాలని మంత్రి పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని సుపరిపాలన వైపు నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై, రాష్ట్ర ప్రభుత్వంపై ఆ ఏసుప్రభు కరుణా కటాక్షాలు మెండుగా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

## క్రిస్మస్ వేడుకులకు ముస్తాబైన నగరం



**నెల్లూరు కల్చరర్, మేజర్‌న్యూస్ :** యేసుక్రీస్తు పుట్టినరోజును పురస్కరించుకుని ప్రతి సంవత్సరం డిసెంబర్ 25న క్రిస్మస్ జరుపుకుంటారు. ఇళ్లను అందంగా అలంకరించడం, బహుమతులు పంచుకోవడం, ఇంటిపై నక్షత్రం ఏర్పాటు.. ప్రత్యేక విందులు చేసుకోవడం ఇవన్నీ పండుగ వేడుకల్లో భాగం. క్రిస్మస్ రోజున పొద్దున్నే చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరుపుతారు. నెల్లూరులోని చర్చిలు దీప కాంతులతో వెలిగిపోతున్నాయి. వీఆర్‌సీ సమీపంలోని బాప్టిస్ట్ హాల్ డౌనీ చర్చి బట్వాడిపాలెంలోని తెలుగు సెకండ్ బాప్టిస్ట్ చర్చి సుందరంగా అలంకరించారు.

# ఇంటి స్థలం రుణం మంజూరు కోసం పోరాటం..




**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు నెల్లూరు నగర సమితి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఇల్లు లేని నిరుపేదలకు రెండు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి, గృహ నిర్మాణం కోసం రూ.5 లక్షల రుణం మంజూరు చేయాలని మంగళవారం సంతపేట సిపిఐ జిల్లా కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా దాదాపు 200 మంది మహిళలతో వచ్చి కలెక్టర్ కార్యాలయంలో వినతులు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి అరిగెల సాయి మాట్లాడుతూ.. నెల్లూరు నగర నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ రెండు సెంట్లు నివేశ స్థలం ఇచ్చి, గృహ నిర్మాణం కొరకు ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో డీఆర్వో నేరుగా వచ్చి మహిళలకు హామీ నిచ్చారన్నారు. నెల్లూరు నగరంలో అనేక మంది రోజువారి కూలీలు, నిరుపేదలు, తెల్లరేషన్ కార్డుదారులు సొంత ఇల్లు లేక బాడుగ ఇళ్లలో నివసిస్తూ వచ్చే చాలీచాలని కూలీ డబ్బుల్లో నుంచి అధిక మొత్తం ఇంటి బాడుగులకు వెచ్చిస్తున్నారని వాపోయారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలలో భాగంగా తాము తెలిపిన డిమాండ్లను అమలు చేయాలని కోరారు. స్థానిక సచివాలయంలో నివేశ స్థలం, ఇంటి కొరకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులైన పేదల వెళితే, వారు సరైన జవాబు చెప్పకపోవడం, ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రికి అపనిందలు తీసుకు వస్తున్నారని తెలిపారు. జిల్లాస్థాయి అధికారి డీఆర్వో ద్వారా ఇక్కడికి వచ్చిన మహిళలందరి అర్హతల ఆధారంగా అర్జీలు సమర్పించారు. అర్జీలను పరిశీలించి అర్హులైన వారందరికీ నివేశ స్థలం కేటాయించాలని, లేనిపక్షంలో అధికారులు ఇచ్చిన గడువు తర్వాత నేరుగా అర్హులైన నిరుపేదలు వారి కుటుంబ సభ్యులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉధృతంగా ఉద్యమం చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు రామరాజు, యాట శ్రీనివాసులు, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు జిలానిఖాన్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నాయకులు వనజమ్మ, సోఫియా, సాయిలత, రైతు సంఘం నాయకులు షాన్వాజ్, ప్రత్యూష్, రేవంత్, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హెూమ్ మంత్రి అమిత్‌షా అవహేళన చేసి మాట్లాడటం సిగ్గుచేటని బుచ్చిరెడ్డిపాలెం బహుజన సేవా సమితి నాయకులు ఆరోపించారు. పట్టణంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన చేపట్టారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై వ్యాఖ్యలు చేసిన మతోన్మాది అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేసి, కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే తమ పోరాటాలు ఉధృత చేస్తామని హెచ్చరించారు.

## అక్రమ మద్యం పట్టివేత




**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండలంలోని అనుమసముద్రం గ్రామం వినాయక సెంటర్ వద్ద అక్ర మంగా తరలిస్తున్న 18 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వినాయక సెంటర్ వద్ద పోలీ సుల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో మండలంలోని పెద్దబీపురం, గ్రామ పంచాయ తీకి చెందిన ఊస పుల్లయ్య, అనే వ్యక్తి 18 క్వాటర్ సీసాలను విక్రయించడానికి తరలిస్తుండగా పట్టు కొని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు. అలాగే పట్టుకున్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. తనిఖీ సమయంలో పోలీస్ సిబ్బంది ఏఎస్ఐ భాస్కర్ రెడ్డి, కానిస్టేబుల్ మధు ఉన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



**చేజర్ల, మేజర్‌న్యూస్ :** కిమ్స్ ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాళ్లూరి గిరినాయుడు ఆదేశాలతో ఆ ఆసుపత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో మండలంలోని మాముడూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామంలో ఉన్న కమ్యూనిటీ హాల్‌లో డాక్టర్ మృదుల 120 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రాజకీయాలకతీతంగా నిరంతరం గ్రామస్తులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి వారి యోగ క్షేమాలకు అండగా నిలబడుతున్న కిమ్స్ ఆస్పత్రి వైద్య బృందంతోపాటు ఆ ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాళ్లూరి గిరినాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల భవన నిర్మాణాల పూర్తికి కృషి

**- అన్ని మౌలిక వసతులతో పాఠశాలను మంచి విద్యాసంస్థగా తీర్చిదిద్దుతాం**

**- రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎంఏ షరీఫ్**




**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ఏపీ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎంఏ షరీఫ్ తెలిపారు. మంగళవారం ఉదయం నెల్లూరు రూరల్ మండలం అక్కచెరువుపాడులోని ఏపీ మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను మైనార్టీ సంక్షేమ అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. తొలుత పాఠశాలకు విచ్చేసిన షరీఫ్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనస్వాగతం పలికారు. అనంతరం అసంపూర్తిగా నిలిచిపోయిన మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల వసతి గృహం, ఉపాధ్యాయుల క్వార్టర్స్, విద్యార్థుల భోజనశాల నిర్మాణ పనులను ఆయన పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలలో తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. భోజనం బాగుందా, పాఠాలు బాగా చెబుతున్నారా అని విద్యార్థులను ప్రశ్నించారు. భోజన శాలలో ఆహార పదార్థాల తయారీని ప్రశ్నిం చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎంఏ షరీఫ్ మీడియాతో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తూ గతంలో 12 మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను మంజూరు చేసిందన్నారు. అయితే గత ప్రభుత్వం నిర్లక్ష్యం వలన ఈ పాఠశాల భవనం పూర్తి కాలేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.15 కోట్లతో మంజూరు చేసిన ఈ గురుకుల పాఠశాల భవన నిర్మాణాలను గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసినట్లు చెప్పారు. త్వరలోనే పెండిరగ్‌లో ఉన్న అన్ని భవన, నిర్మాణాలను పూర్తి చేసి అన్ని వసతులతో గురుకుల పాఠశాలను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని షరీఫ్ చెప్పారు. ప్రస్తుతం 260 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, ఈ పాఠశాలలో 5 నుంచి 10వ తరగతి వరకు ఒక్కొక్క తరగతికి 80మంది విద్యార్థులను చేర్చుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, ఆ మేరకు పూర్తిస్థాయిలో విద్యార్థులు చేరేలా అన్ని వసతులు సమకూరుస్తామన్నారు. మైనార్టీల విద్యాభివృద్ధికి తెలుగుదేశం ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్న షరీఫ్ అంచెలంచెలుగా ఈ పాఠశాలను ఉన్నతస్థాయి విద్యాసంస్థగా అభివృద్ధి చేస్తామన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడి కేవలం ఆరుమాసాలే అవుతుందని, ప్రజలకు ఇచ్చిన ఒక్కొక్క హామీని తమ ముఖ్యమంత్రి నెరవేర్చేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

### మైనార్టీ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పనపై దృష్టి పెట్టండి

**- వక్ఫ్‌బోర్డు భూములను స్వాధీనం చేసుకోండి : షరీఫ్**

నెల్లూరు జిల్లా పరిధిలో వున్న వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షించేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎంఏ షరీఫ్ అధికారులకు సూచించారు. నెల్లూరు ఆర్ అండ్ బి అతిథి గృహంలో మైనారిటీ సంక్షేమ, మైనార్టీ కార్పొరేషన్, వక్ఫ్ బోర్డు అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. యువతకు శిక్షణ ఇచ్చి పీఎంఈజీపి రుణాలను మంజూరు చేసి చిన్న చిన్న పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలన్నారు. పరిశ్రమల శాఖ జీఎంతో సమన్వయం చేసుకుని యువతకు శిక్షణ ఇచ్చి రుణాలు మంజూరు చేయించాలని సూచించారు. అలాగే అన్యాక్రాంతమైన వక్ఫ్‌బోర్డు భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రత్యేక కార్యాచరణతో పని చేయాలన్నారు. ఉర్దూ పాఠశాలల్లో విద్యాబోధన, వసతి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా వక్ఫ్‌బోర్డు ఇన్స్‌పెక్టర్ కుదావన్ మాట్లాడుతూ.. జిల్లాలో 30 మండలాల్లో 2383 ఎకరాల భూమి వక్ఫ్‌బోర్డుకు చెందినది కాగా, 520 ఎకరాలు మాత్రమే వక్ఫ్‌బోర్డు పరిధిలో వుందని, మిగిలిన భూమి కోర్టు కేసులు, ఆక్రమణల్లో వున్నట్లు చెప్పారు. ఇటీవల కలెక్టరు ఆదేశాలతో ఉలవపాడు మండలం కె.రాజుపాలెంలో 39 ఎకరాల భూమిని స్వాధీనంచేసుకున్నామని, వలేటివారిపాలెంలో 27ఎకరాల భూమిని కూడా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. జిల్లాలో 79 ఉర్దూ పాఠశాలల్లో 280మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, 3500మంది విద్యార్థులు ఉర్దూ అభ్యసిస్తున్నట్లు ఉర్దూ డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఖాజా మొహిద్దీన్ తెలిపారు. 3 ఉర్దూ అకాడమీలు ఉన్నాయని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి శ్రీనివాసరావు, మైనార్టీ కార్పొరేషన్ ఈడి హైఫా, వక్ఫ్ బోర్డు ఇన్స్‌పెక్టర్ కుదావన్, ఉర్దూ డిప్యూటీ ఇన్స్ పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఖాజా మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# వీఎస్‌యూను సందర్శించిన మాజీ వైస్ ఛాన్సలర్




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి యూనివర్సిటీకి మంగళవారం ఉదయం మాజీ ఉపకులపతి ఆచార్య రొక్కం సుదర్శన రావు విచ్చేశారు. ఈ సందర్శనలో విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని సీవీ రామన్ సెమినార్ హాల్‌లో ప్రత్యేక సమావేశం జరిగింది. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్.విజయ భాస్కర రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, బోధన, బోధనేతర సిబ్బంది ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య ఎస్.విజయ భాస్కర రావు మాట్లాడుతూ.. 'విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, పరిశోధనలో కొత్త ఆవిష్కరణలు, సామాజిక బాధ్యతలపై విశ్వవిద్యాలయం దృష్టి పెట్టింది. ఆచార్య రొక్కం సుదర్శన రావు సందర్శన విశ్వవిద్యాలయానికి ప్రేరణ కలిగించగలదని' పేర్కొన్నారు. ఆచార్య రొక్కం సుదర్శన రావు మాట్లాడుతూ.. 'ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అవకాశాలు, సవాళ్లు' అనే అంశంపై ప్రసంగించారు. యువతీ, యువకులు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని, వారి నాయకత్వ నైపుణ్యాలు దేశాభివృద్ధికి మేలును చేకూర్చగలవని చెప్పారు. కార్యక్రమం ముగిసిన తర్వాత, విశ్వవిద్యాలయ ప్రతినిధులు ఆచార్య రొక్కం సుదర్శన రావుకు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఈ సమావేశంలో విశ్వవిద్యాలయ ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్. విజయ, ఆచార్య టి.వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాము కాటుకు నీళ్ల బాలకృష్ణయ్య మృతి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని మల్లూరు గ్రామ పంచాయతీకి చెందిన నీళ్ళ బాలకృష్ణయ్య(75)అనే వృద్ధుడు పాముకాటుకు గురై మృతి చెందిన సంఘటన జరిగింది. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులతోపాటు కుటుంబ సభ్యులు మంగళవారం మీడియాకు తెలిపారు. సోమవారం రాత్రి సమయంలో ఇంటి సమీపంలో తప్పి పోయిన గేదెను వెతికేందుకు వెల్లగా చీకటిలో విష పాము వృద్ధుడుని కాటేసింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను నాటు వైద్యం కోసం జంగాల కండ్రిగ గ్రామానికి తీసుకువెళ్లారు. అక్కడ నుంచి నెల్లూరు ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అయినప్పటికీ మార్గమధ్యంలోనే ఆయన చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీళ్లు పెట్టుకున్నారు. మృతి చెందిన విషయాన్ని ప్రభుత్వ అధికారులు నమోదు చేసుకున్నారు.

## ఘనంగా జాతీయ వినియోగదారుల దినోత్సవం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మం గళవారం జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.నారాయణస్వామి మాట్లాడుతూ.. వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు సమాజాన్ని చైతన్య పర్చాలన్నారు. అనంతరం వినియోగదారుల హక్కులు, అవశ్యకతలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. నరసింహులు, అధ్యాపకులు విక్రమ్ వాను, శ్యామ్యూల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# బండగానిపల్లిలో పారిశుధ్య మెరుగుకు చర్యలు




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని బండగానిపల్లి పంచాయతీ బిజ్జంపల్లి, లింగంనేనిపల్లి, కృష్ణారెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం ఇన్‌చార్జ్ ఎంపీడీవో అప్పాజీ ఆదేశానుసారం పంచాయతీ కార్యదర్శి చినబాబు ఆధ్వర్యంలో సిబ్బంది పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా తాగునీటి పథకాలు, చేతిపంపులు, మురికినీటి కాలువల్లో చెత్తాచెదారాన్ని తొలగించి బ్లీచింగ్ చల్లారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతిఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా స్వీట్లు పంపిణీ



**కలిగిరి, మేజర్‌న్యూస్ :** మానవ జీవితంలో ప్రతి ఒక్కరూ ఐక్యత ప్రేమ దయతో నిజాయితీగా జీవించడమే క్రీస్తు బోధనల సారాంశమని విశ్రాంతి డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ కే.మాశిలామణి పేర్కొన్నారు. మంగళవారం వింజమూరులోని శ్రీ కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ ప్రాంగణంలో క్రిస్మస్ సందర్భంగా క్రిస్టియన్ సోదరులకు శ్రీ కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నియోజకవర్గంలోని చర్చిలకు స్వీట్లు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కె.మాశిలామణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ గత మూడు సంవత్సరాలుగా నియోజకవర్గంలోని సుమారు 150 చర్చిలకు పైగా స్వీట్ బాక్సులు పంపిణీ చేసి ఫాదర్స్ ద్వారా ప్రతి క్రిస్టియన్స్‌కి స్వీట్లు పంపిణీ చేసి వారి ఇంట క్రిస్మస్ వేడుకల్లో భాగమవుతున్నారన్నారు. అదేవిధంగా ఈ ఏడాది మండల నాయకత్వం ద్వారా ముందు రోజే స్వీట్ బాక్స్‌ల పంపిణీకి శ్రీకారం చుట్టారన్నారు. భారతదేశంలో క్రైస్తవ మతానికి సుమారు 2000 సంవత్సరాలకు పైగా ఘన చరిత్ర ఉందన్నారు. అందరూ ఐకమత్యంగా క్రిస్మస్ వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆకాంక్షించి స్వీట్లు పంపిణీ చేశారని ఆయనకు అందరూ కృతజ్ఞతా భావంతో ఉండాలని క్రిస్టియన్ సోదరులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ముందుగా డాక్టర్ కె.మాశిలామణిని మహేష్ మధురెడ్డి శాలువాతో సన్మానించారు. అనంతరం స్వీట్ బాక్సులు పంపిణీ చేశారు.

# వైసిపి పోరుబాటను విజయవంతం చేయాలి : డాక్టర్ చిల్లూరు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ చేపట్టనున్న పోరుబాట కార్యక్రమాన్ని అందరూ సమిష్టిగా విజయవంతం చేయాలని ఆత్మకూరు మండల మాజీ జెడ్పిటిసి సభ్యులు, పట్టణ జెసిఎస్ కన్వీనర్ డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్తానిక వైసిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాలమేరకు పోరుబాట పోస్టర్లను డాక్టర్ ఆదిశేషయ్య, పట్టణ వైసిపి అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనందరెడ్డి తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆదిశేషయ్య మాట్లాడుతూ.. జిల్లా వైసిపి అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాలమేరకు మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్‌చార్జీల బాదుడుపై ఈనెల27వతేదీన వైసిపిపోరుబాట కార్యక్రమం నిర్వహించతలపెట్టామని, ఈకార్యక్రమంలో ప్రజలు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో విద్యుత్‌చార్జీలు పెంచబోమని ప్రకటించిన కూటమి అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే విద్యుత్‌చార్జీలు పెంచారని వారు విమర్శించారు. ఈ ప్రభుత్వంపై నిరసన తెలిపేందుకు ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ బస్టాండునుండి విద్యుత్‌శాఖ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహిస్తామని, అక్కడ ధర్నా చేసిన అనంతరం ఈఈకి వినతిపత్రం అందజేస్తామని డాక్టర్ చిల్లూరు పేర్కొన్నారు. ప్రజలకోసం, ప్రజలతరపున నిర్వహిస్తున్న ఈ పోరుబాటలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, కుటుంబసభ్యులు, ప్రజలు అధికంగా పాల్గొనాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనందరెడ్డి, జిల్లా బూత్‌కమిటీల అధ్యక్షుడు బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మాజీ సొసైటీ చైర్మెన్లు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, జిల్లా వైసిపి యువజనవిభాగం ప్రధానకార్యదర్శి నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, వైసిపి నాయకులు కొండా వెంకటేశ్వర్లు, పులిమి రమేష్‌రెడ్డి, పాలేటి వెంగళరెడ్డి, బట్రెడ్డి జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల షాపుల్లో ఏడిఏ తనిఖీలు





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని ఎరువుల దుకాణాలు, సొసైటిల గోడౌన్లలో సోమవారం స్తానిక వ్యవసాయ సహాయ సంచాలకులు వి.దేవసేనమ్మ స్తానిక మండల వ్యవసాయాధికారి కె.కిషోర్‌బాబుతో కలిసి తనిఖీలు నిర్వహించారు. స్థానిక సిండికేట్ రైతుసేవా సహకార సంఘం, గ్రోమోర్ సెంటర్ తదితర షాపుల్లో ఎరువులను ఆమె పరిశీలించారు. యూరియా నిల్వలు, రైతులకు సరఫరా తదితర అంశాలను ఆమె నిశితంగా పరిశీలించారు. రికార్డులను, నిల్వలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడిఏ మాట్లాడుతూ.. ప్రస్థుతం మండలంలో 50 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందన్నారు. యూరియా కొరత లేదని, రైతులకు అవసరమైనంతమేరకు యూరియా సరఫరా చేస్తామని పేర్కొన్నారు. ప్రవేటు ఎరువుల దుకాణాదారులు ఎరువుల కొరత సృష్టించినట్లయితే తగు చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. ఎంఆర్‌పి కన్నా ధరలు అధికంగా విక్రయించరాదని, ఇతర ఎరువుల లింకుపెట్టి విక్రయించినా కఠినచర్యలు తీసుకుంటామని దేవసేనమ్మ హెచ్చరించారు. రైతులు యూరియాను నిల్వ చేసుకోవాల్సిన అవసరం లేదని, యూరియాకొనుగోలులో స్తానికులకు, సన్న, చిన్నకారు రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె సొసైటిల ప్రతినిధులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.కిషోర్‌బాబు, సిండికేట్ ఫార్మర్స్‌సొసైటి, గ్రోమోర్ సంస్థల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చర్చిలకు మిఠాయిల పంపిణీ

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని అన్ని గ్రామాల చర్చిలకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అందజేసిన మిఠాయిల బాక్సులను మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న మంగళవారం టీడీపీ నాయకులతో కలిసి చర్చి నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రిస్మస్ పర్వదినంలో భాగంగా బుధవారం స్థానిక బర్డిట్ మెమోరియల్ బాప్టిస్టు చర్చిలో నిర్వహించే ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే పాల్గొని క్రైస్తవ సోదరులకు పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారని ఆయన తెలిపారు. క్రైస్తవ సోదరులు సుఖసంతోషాలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా. ఖాన్సా తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ విజేత స్కూల్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని శ్రీ విజేత ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కామాక్షి మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు బోధించిన మతం, క్రైస్తవులు క్రైస్తవ మతాన్ని పటిస్తారని, క్రైస్తవులు చేసుకునే పండుగలలో 'క్రిస్మస్' పండుగ అత్యంత ప్రియమైనదని, ఏసుక్రీస్తు జన్మించిన రోజు డిసెంబర్ 25వ తేదీన క్రీస్తు పుట్టిన ఆ రోజు నాడే క్రిస్మస్ పండుగను ప్రపంచంలో క్రైస్తవులంత మిక్కిలి ఆనందోత్సాహాలతో వేడుకగా జరుపుకుంటారని, 25న ప్రపంచవ్యాప్తంగా బిలియన్ల మంది ప్రజల మధ్య మతపరమైన, సాంస్కృతిక వేడుకగా జరుపుకుంటారనీ, చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే సమయమిదని ఆమె విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్రిస్మస్ తాత సందడిజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాద్యాయులు, విద్యార్ధులు పాల్గొన్నారు.

# క్రైస్తవ సోదరులకు ఎమ్మెల్యే స్వీట్లు పంపిణీ



**జలదంకి, మేజర్‌న్యూస్ :** క్రిస్మస్ సందర్భంగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జలదంకి మండలం పరిధిలోని 17 గ్రామ పంచాయతీలలోని 66 చర్చిలకు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా క్రైస్తవులకు సోదరులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ.. క్రీస్తు బోధనలు ప్రేమ, ఐక్యత, శాంతి నిజాయితీ గురించి ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని క్రైస్తవ సోదరులతో నా ఆనందాన్ని పంచుకోవడం నాకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. క్రైస్తవ సోదరులందరికీ నా హృదయపూర్వక క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పర్వదినం మీ అందరి జీవితంలో ఆనందం, శాంతి నింపాలని కోరుకుంటున్నాను అని ఆయన తెలిపారు. ఏడాది మండల కూటమి నాయకత్వం ద్వారా ముందు రోజు స్వీట్స్ బాక్సులు పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల యువనేత మునగాల తిరుమలరెడ్డి, ఐ-టీడీపి రఘు, మధుసూదన్ రెడ్డి, పాండురంగారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు బ్రహ్మారెడ్డి తదితరులు పాలుగోన్నారు.

# ఏకగ్రీవంగా వీఆర్వోల సంఘం ఎన్నికలు

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినాయి. మంగళవారం గ్రామ రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సమావేశం ఏర్పాటు చేసుకొని ఏకగ్రీవ తీర్మానంలో విఆర్వో పోలయ్యను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఉడతా సురేష్ (ఉపాధ్యక్షులు) పొన్నాటి ప్రసాద్ (కార్యదర్శి) పడిగినేని పవన్ (సహాయ కార్యదర్శి) బి.స్పందన (కోశాధికారి) ఎన్నిక కావడం జరిగింది. అదేవిధంగా కార్యవర్గ సభ్యులుగా నారాయణ, శ్రీనివాసులు, భక్తవత్సలరెడ్డి, ఉమాదేవి, అజయ్, తిరుపతి, శ్రీనివాసులు బాధ్యతలు తీసుకున్నారు.

# ఆత్మకూరులో జోరుగా హుషారుగా టీడీపీ సభ్యత్వనమోదు



- మంత్రి ఆనం ఆదేశాలతో ముమ్మరంగా కార్యక్రమం
- రాష్ట్రంలో తొలి 10స్థానాల్లో ఆత్మకూరు
- నియోజకవర్గంలో పోటా పోటీగా మండలాలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం సభ్యత్వ నమోదు కార్యక్రమం అత్యంత జోరుగా సాగుతోంది. ఈనియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి మండలాలవారీగా సమీక్షా సమావేశాలు నిర్వహించి తెలుగుదేశం సభ్యత్వనమోదును లక్ష్యంకన్నా అధికంగా చేయాలని సూచించడంతో నియోజక వర్గంలోని ఆత్మకూరు అర్బన్, ఆత్మకూరు రూరల్, మర్రిపాడు, ఏఎస్‌పేట, అనంత సాగరం, చేజర్ల, సంగం మండలాల్లో రాష్ట్ర, నియోజకవర్గ, పట్టణ, మండ, గ్రామస్థాయి నాయకులు రెట్టింపు ఉత్సాహంతో ఊరూవాడా పర్యటిస్తూ ఆన్‌లైన్ ద్వారా ఓటర్లను టిడిపి సభ్యులుగా చేర్చుతున్నారు. అత్యధికంగా అందరూ స్వచ్ఛందంగా టిడిపి సభ్యత్వం పొందుతున్నారు. ముఖ్యమంత్రి, టిడిపి జాతీయఅధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రి, పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్‌బాబుల ఆదేశాలు, ఇక్కడ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అభివృద్ధి ప్రదాతగా పేరుగాంచి ఉండడంతో నాయకులు ఉత్సాహంగా తెలుగుదేశం సభ్యత్వాలు నమోదు చేయిస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2లక్షలా 16వేల మందికాగా 55.5శాతం మందిని టిడిపి సభ్యులుగా చేర్చాలన్నది పార్టీ అధిష్టాన లక్ష్యమని, ఇప్పటికే ఆత్మకూరులో 1.2లక్షలకు పైగా సభ్యత్వాలు నమోదయ్యాయని చెబుతున్నారు. ఇప్పటివరకు చూస్తే రాష్ట్రంలో టిడిపి సభ్యత్వంలో తొలిపది స్థానాల్లో ఆత్మకూరు నిలిచింది. మొదటి స్థానం రాజంపేట, రెండవస్థానం కుప్పం, మూడవస్థానం కళ్యాణదుర్గం, నాలుగవస్థానం పాలకొల్లుకాగా ఐదవస్థానంలో ఆత్మకూరు నియోజకవర్గం నిలిచిందని ఆపార్టీ వర్గాలద్వారా తెలిసింది. ఆత్మకూరు నియోజకవర్గంలో టిడిపి సభ్యత్వనమోదులో పోటాపోటీగా చేయిస్తున్నారని, నియోజకవర్గ లక్ష్యాన్ని అధిగమించాలనే పట్టుదలగా సాగిస్తున్నారు. ఆత్మకూరు పట్టణంలో తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, ఇతర నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, ఇందూరు వెంకటరమణారెడ్డి, గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, చల్లా రవికుమార్‌రెడ్డి, తదితరులు, ఆయా వార్డుల టిడిపి కౌన్సిలర్లు, టిడిపి నాయకులు ముమ్మరంగా సభ్యత్వనమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రాష్ట్ర తెలుగుమహిళ కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి దావా పెంచలరావు, నియోజకవర్గ టిడిపి నాయకులు తాళ్ళూరు గిరినాయుడు, పుట్టం బ్రహ్మానందరెడ్డి, కాటంరెడ్డి రవీంద్రారెడ్డి తదితరులతోపాటు ఆయా మండలాల టిడిపి నాయకులు, ఆత్మకూరు మండలంలో మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి,పార్టీ మండల అధ్యక్ష,ప్రధానకార్యదర్శులు సుంకర పెంచలచౌదరి, కేతా విజయభాస్కరరెడ్డి, తదితరులంతా మంత్రి ఆనం ఆదేశాలమేరకు టిడిపి సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోనే ఆత్మకూరు నియోజకవర్గాన్ని ప్రథమస్థానంలో నిలపాలన్న సంకల్పంతో వారంతా కార్యక్రమాన్ని సాగిస్తున్నారు.

# చారిత్రాత్మక ఘట్టానికి నాంది పలుకుదాం

- ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు సమన్వయంతో పని చేయాలి
- అల్లూరు ప్రతిష్ట ఇనుమడింప చేసేలా కార్యక్రమం చేపడదాం
- కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి వెల్లడి

**అల్లూరు, మేజర్‌న్యూస్ :** అల్లూరు తిరునాళ్ళ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా చరిత్రను తిరగరాసే విధంగా అల్లూరు తిరునాళ్ళను నిర్వహించి చారిత్రాత్మక ఘట్టానికి నాంది పలుకుదామని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి కోరారు. డిసెంబర్ 31వ తేదీన అల్లూరులో నిర్వహించనున్న పోలేరమ్మ, గంగమ్మ, కలుగోలమ్మ తిరునాళ్ల ఏర్పాట్లపై కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో కావలి ఆర్డీఓ వంశీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కావలి డిఎస్పి శ్రీధర్‌తోపాటు అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తిరునాళ్ళ కార్యక్రమానికి సంబంధించిన వివరాలు, ఆలయంలో నిర్వహించే కార్యక్రమాలు, బయట చేపట్టే కార్యక్రమాలకు సంబంధించిన సమయాలతో కూడిన ప్రోగ్రాం చార్ట్, రూట్ మ్యాప్ తయారు చేసి అధికారులు అందరికీ అందజేసి సమన్వయంతో పని చేయాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు వాలంటీర్ లను ఏర్పాటు చేసుకొని వారి సేవలను వినియోగించుకోవాలని కోరారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు ఉత్సవ కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. అగ్నిమాపక, పోలీస్, విద్యుత్, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. తిరునాళ్లలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా అల్లూరు ప్రతిష్టను ఇనుమడింప చేసేలా, అమ్మవారి ఆశీస్సులు అందరికీ లభించేలా కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు.

## వీఎస్‌యూ ఉద్యోగి శిఖరం ద్వారకకు నివాళి



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగి శిఖరం ద్వారక ఆకస్మిక మరణం చెందారు. విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో సీవీ రామన్ సెమినార్ హాల్‌లో వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎస్.విజయ భాస్కర రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ.. ద్వారక గారి కృషి, సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ సునీత ఆయన సానుకూల ప్రవర్తన అందరికీ ప్రేరణగా నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్. విజయ, ఇతర అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నిపండుగలను చిన్నారులకు తెలియజేయాలి : సిడిపివో

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పండుగలన్నింటని గురించి చిన్నారులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆత్మకూరు ఐసిడిఎస్ సిడిపివో పి.సునీలత పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.రత్నమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్త షేక్ షకీలా నిర్వహించిన ఈకార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న సిడిపివో ప్రసంగించారు. చిన్నారులచే క్రిస్మస్‌తాత వేషధారణలు గావించగా అందరినీ ఆకట్టుకున్నాయి. సునీలత మాట్లాడుతూ అన్ని పండుగల పట్ల చిన్నారులకు ఈ వయసునుండే అవగాహన కల్పించడం ఆవశ్యకమన్నారు. పండుగల నిర్వహణ, ప్రాధాన్యతను వారు బాగా గుర్తుంచుకోగలరని, నిర్వహణలో ముమ్ముందు భాగస్వామ్యులు కాగలరని సునీలత పేర్కొన్నారు.




అంగన్‌వాడీ కేంద్రంలో క్రిస్మస్ వేడుకల్లో సిడిపివో తదితరులు

ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.రత్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త షకీలా, సహాయకురాలు విజయమ్మ, చిన్నారులు వారి తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## యర్రాజొన్న వెంకటమ్మ మృతికి ఎమ్మెల్యే నివాళి

**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం సాంబశివపురంకు చెందిన టీడీపీ నాయకుడు యర్రాజొన్న శ్రీహరి తల్లి వెంకటమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి మంగళవారం సాంబశివపురంలోని వారి నివాసానికి చేరుకొని ఆమె భౌతిక ఖాయాన్ని దర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, లెల్లపల్లి సుధీర్‌బాబు, గ్రామస్తులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సైబర్‌నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి



సీఐను సన్మానిస్తున్న రామ్మోహన్‌రెడ్డి



ప్రసంగిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

## ● మాదకద్రవ్యాల జోలికెళ్ళవద్దు : సీఐ గంగాధర్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** సమాజంలో అన్నివర్గాలతోపాటు విద్యార్థులు కూడా సైబర్‌నేరాల పట్ల అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు సి.ఐ జి.గంగాధర్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రగతి ఇంగ్లీష్‌మీడియం ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ ఎస్.రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైబర్‌నేరాలు, మాదకద్రవ్యాలు, ఈవ్‌టీజింగ్ అంశాల అవగాహనా సదస్సులో సిఐ పాల్గొని ప్రసంగించారు. సైబర్‌నేరాలు ఏవిధంగా జరుగుతుంటాయని జనాలు ఎలా మోసపోతుంటారు, నష్టపోతుంటారు అనే అంశం గురించి సుధీర్ఘంగా వివరించారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలతో సైబర్‌మోసాలబారిన పడకుండా ఉండాలని ఆయన కోరారు.



ప్రసంగిస్తున్న సీఐ గంగాధర్

మాదకద్రవ్యాలజోలికెళ్ళరాదని, అనేక విదాల నష్టపోగలరని ఆయన పేర్కొన్నారు. తాత్కాలిక ఆనందం కోసం మాదకద్రవ్యాలకు అలవాటుపడరాదని సిఐ సూచించారు. విద్యాసంస్థల్లో ఈవ్‌టీజింగ్‌కు ఎవరూ పాల్పడరాదని ఆయన సూచించారు. స్కూల్ కరస్పాండెంట్ ఎస్.రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సైబర్‌నేరాలు, మాదకద్రవ్యాలు, ఈవ్‌టీజింగ్ పట్ల తగిన అవగాహన కలిగి జాగ్రత్తలు పాటించాలన్నారు. తమవంతుగా అలాంటి పరిణామాలు చోటుచేసుకొనకుండా తమ సంస్థలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని కూడా ఆయన పేర్కొన్నారు. ఈసందర్భంగా సిఐ గంగాధరంను రామ్మోహన్‌రెడ్డి శాలువా, పుష్పగుచ్ఛంలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ అమరావతి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వెన్నవాడలో పొలం పిలుస్తోంది కార్యక్రమం






**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం వెన్నవాడలో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కె.కిషోర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయసహాయ సంచాలకులు వి.దేవసేనమ్మ అతిధిగా పాల్గొన్నారు. దేవసేనమ్మ ప్రసంగిస్తూ వరిసాగులో రైతులు ఎరువులను అధికమోతాదులో వాడకుండా భూసారపరిక్షల ఫలితాలకనుగుణంగా వాడుకోవాలన్నారు. ప్రస్తుత చలి వాతావరణంలో వరిలో జింక్ లోపం కన్పిస్తుందన్నారు. నివారణకు ఒక లీటరు నీటిలో 2గ్రాముల జింక్‌సల్ఫేట్ వంతున వారం రోజుల వ్యవధిలో రెండుదపాలు పిచికారీ చేయాలని ఆమె సూచించారు. మండలవ్యవసాయాధికారి కె.కిషోర్‌బాబు మాట్లాడుతూ రైతులు సాగుచేస్తున్న పంటను తప్పకుండా ఇ-పంటలో నమోదు చేయించుకోవాలన్నారు. పంటరుణం తీసుకునే కౌలురైతులు తప్పకుండా పంటలభీమా ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో విఏఏ ఐ.దీప, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## శ్యామ్ బెనగల్ మృతికి ప్రజానాట్య మండలి సంతాపం

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్ :** దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, ప్రముఖ సినీ దర్శకుడు శ్యాం బెనగల్ మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి సీనియర్ నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.చంద్ర నాయక్, చిన్నం పెంచలయ్యలు మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో సంతాపాన్ని ప్రకటించారు అభ్యుదయ భావజాలం కలిగిన శ్యాం బెనగల్ మృతి చెందటం కళారంగానికి తీరని లోటని,ఎన్నో సామాజిక ప్రయోజనంతో కూడుకున్న చిత్రాలకు ఆయన పని చేశారని ఈ సందర్భంగా వారు తెలిపారు. ప్రజానాట్యమండలి కార్యకలాపాల పట్ల సానుకూల దృక్పథంతో వారు ఉండేవారని తెలిపారు. తన ప్రతిభ ప్రతీకగా పద్మశ్రీ పద్మభూషణ్, అవార్డులతో పాటు ఏడుసార్లు జాతీయ అవార్డులు కూడా అందుకున్నారు. ఈ లెజెండరీ డైరెక్టర్ 2003లో ఇందిరా గాంధీ జాతీయ సమైక్యతా పురస్కారం 2013లో ప్రఖ్యాత అక్కినేని నాగేశ్వరరావు అవార్డు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ఇలా ఎన్నో ప్రతిష్టాత్మక పురస్కారాలు కీర్తి కిరీటంలో నిలిచాయని అన్నారు.

## మద్యం బాటిళ్లు స్వాధీనం-ఇద్దరి అరెస్ట్

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్ :** అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాప్ లపై దాడులు నిర్వహించి మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకుని ఇద్దరి వ్యక్తులను అరెస్టు చేసినట్లు వెదురుకుప్పం ఎస్సై వెంకటసుబ్బయ్య మంగళవారం తెలిపారు. మండలం లోని కొండ కిందపల్లి గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నా రని సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడులు నిర్వ హించగా నరసింహారెడ్డి, మల్లికార్జున రెడ్డిల నుండి 37 మద్యం బాటిలను, కర్ణాటక రాష్ట్రానికి చెందిన 51 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇరువురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

## కృష్ణంపల్లిలో రెవెన్యూ సదస్సు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని కృష్ణంపల్లి గ్రామంలో మంగళవారం తహసీల్దారు సుభద్ర రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు, రైతులు పలు సమస్యలపై అర్జీలు అందజేశారు. అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కారమార్గం చూపుతామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో అంజాద్, సర్వేయర్ శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 28న మండల సర్వసభ్య సమావేశం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఈనెల 28న స్థానిక స్త్రీశక్తి భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో అప్పాజీ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ మూలె పద్మజ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

## క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు



**▶ మాజీ ఎమ్మెల్యే మేకపాటి**

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** త్యాగం, కరుణ, ప్రేమ గొప్పతనాన్ని ఏసుక్రీస్తు తమ బోధనల ద్వారా విశ్వమానవాళికి తెలియచేశారని, అలాంటి ప్రేమాను రాగాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరుకుంటూ క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలుపుతున్నామని ఆత్మకూరు మాజీ శాసన సభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు. కరుణామయుడు జీసస్ దయ ప్రజలందరిపై ఉండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో మెలగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అభాగ్యులపై క్రీస్తు చూపిన ప్రేమ, కరుణ, శాంతి ప్రతి ఒక్కరిలో ఉండాలని కోరుకుంటున్నామని అన్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా అందరూ ఆనందంగా గడపాలని కోరుకుంటున్నట్లు మేకపాటి తెలిపారు.

## జనసేన నాయకుల అన్నదానం

**పుంగనూరు, మేజర్‌న్యూస్ :** జనసేన మండలాధ్యక్షుడు విరుపాక్షి జన్మదిన సందర్భంగా గోకుల్ సర్కుల్లో ఎన్టీఆర్ విగ్రహం దగ్గర మంగళవారం జనసేన నాయ కులు శివ కుమార్ రెడ్డి, హరినాయక్, బాలాజీ నాయ క్, బొట్టు శీను అన్నదాన కార్యక్రమం చేశారు వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నిరాడంబరుడు నిత్య కృషి వలుడు త్యాగశీలి దయా మయుడు అయిన మా అన్న విరుపాక్షి మరెన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని ఆ కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామిని కోరుకుంటు న్నామన్నారు ఈ కార్యక్రమంలో మండలంలోని జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యకు చాకచక్యంగా పరిష్కారం

**వి.కోట, మేజర్‌న్యూస్ :** పూర్వికులు ఆస్తి.. అక్రమ ణలకు పాల్పడ్డారు. సర్వే చేయించండి.. ఆక్రమణలు తొలగించండి.. న్యాయం చేయండి.. అంటూ రెం డేళ్లుగా ఓ యువతి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ.. తిరిగింది. ఎవరూ పట్టించుకోలేదు. తాసిల్దార్ దీర్ఘ కాలిక సమస్యను చాకచక్యంగా పరిష్కారం చూపారు. వివరాల్లోకెళ్తే మండలంలోని నేర్నిపల్లి గ్రామపంచా యతీ మిట్టూరు గ్రామానికి చెందిన సంయుక్త వాళ్ళ తల్లికి పూర్వీకుల నుంచి ఆస్తి సంక్ర మించింది. కొంత భూమి ఆక్రమణకు గురైంది. సర్వే చేపట్టి ఆక్రమణలు తొలగించాలని బాధితులు రెండేళ్లుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగారు. నాయకులకు విన్నవించారు. ఫలితం లేకుండా పోయింది. వీ.కోట తాసిల్దార్ పార్వతీ దృష్టికి తీసుకువచ్చింది. న్యాయం చేయాలంటూ విన్నవించింది. తహశీల్దార్ పోలీసుల ఆధ్వర్యంలో సర్వే అధికారులతో సర్వే చేయించారు. కొంత స్థలం ఆక్రమణకు గురైంది. ఆక్రమణదారులతో చర్చించారు. ఇరువర్గాల మధ్య రాజీ కుదరడంతో సమస్యకు అడ్డుకట్ట పడింది. దీర్ఘకాలిక రెవెన్యూ సమస్యను దగ్గరుండి పరిష్కారం చేసిన తహశీల్దార్‌ను పలువురు ప్రశంసించారు. బాధితులు తాసిల్దార్ కు కృతజ్ఞతలు తెలిపారు.ప్రజలు నైతిక విలువలకు కట్టుబడి జీవనం సాగించాలని తాసిల్దార్ సూచించారు.

## వైభవంగా గొబ్బెమ్మ గ్రామోత్సవం

**శ్రీకాళహస్తి అర్బన్, మేజర్‌న్యూస్ :** శ్రీకాళహస్తీ శ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాసం సంద ర్భంగా గొబ్బెమ్మ ఉత్సవ విగ్రహాన్ని పలు రకాలు పుష్పాలతో శోభామయంగా అలంక రించి విశేష పూజలు నిర్వహించి దీప దూప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం గొబ్బెమ్మ నగరోత్సవాన్ని కనుల పండుగ నిర్వహించారు.

గురుగోవింద్ సింగ్ కుమారులకు నివాళిగా..

# డిసెంబర్ 26న 'వీర్ బాల్ దివస్'

**జోరావర్ సింగ్, ఫతే సింగ్‌లకు నివాళి**




**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని ఏసీ నగర్‌లో ఉన్న సత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్, వైకె ఆచారి స్కూళ్లలో వీర బాలల దివస్ కార్యక్రమానికి ముఖ్య వక్తగా సావర్కర్ విచ్చేశారు. పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ.. వీర్ బల్ దివస్, డిసెంబర్ 26న జరుపుకుంటారని ఇది వీరత్వం మరియు త్యాగం యొక్క స్ఫూర్తితో నిండిన రోజు అని ఇది 10వ సిక్కు గురువు గురుగోవింద్ సింగ్ జీ యొక్క చిన్న కుమారులు సాహిబ్జాదా జోరావర్ సింగ్, సాహిబ్జాదా ఫతే సింగ్ యొక్క బలిదానం జ్ఞాపకార్థం. అని 9, 7 సంవత్సరాల వయస్సు గల ఈ యువ రాకుమారులు తమ విశ్వాసాన్ని విడిచిపెట్టడానికి నిరాకరించినందుకు సజీవంగా చంపబడ్డారన్నారు. భారత ప్రభుత్వం, ప్రత్యేకంగా ప్రధానమంత్రి, యువ సాహిబ్జాదాస్, జోరావర్ సింగ్, ఫతే సింగ్‌ల ధైర్యసాహసాలు, త్యాగాలను గౌరవించేందుకు వీర్ బల్ దివస్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ డిసెంబర్ 26న జాతీయ దినోత్సవంగా ప్రకటించారనీ, వారి అసాధారణ ధైర్యాన్ని స్మరించుకుందమని వారి స్ఫూర్తిదాయకమైన కథను భవిష్యత్తు తరాలలో వారి మనసుల్లో సజీవంగా ఉంటుందని అన్నారు. సమాజంపై వీర్ బల్ దివస్ ప్రభావం చాలా లోతైనదని, విస్తృతమైనది అని ఇది దేశ చరిత్ర, సాంస్కృతిక వారసత్వం పట్ల గర్వం, గౌరవాన్ని కలిగిస్తుందన్నారు. ముఖ్యంగా యువ తరానికి ధైర్యసాహసాలు, విశ్వాసాల కోసం దృఢంగా నిలబడటం వంటి విలువలను నేర్పిస్తూ స్ఫూర్తినిస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో బిజెపి రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, మండల అధ్యక్షులు జివిటి ప్రభాకర్ ప్రధాన కార్యదర్శి మింగా కిరణ్ కుమార్, జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ కుమార్ బీజేవైఎం అధ్యక్షులు అశోక్ నాయుడు మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గంటా విజయ శ్రీ మారం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రొబిషన్, ఎక్సైజ్ అధికారుల ముమ్మర తనిఖీలు



**బోగోలు, మేజర్‌న్యూస్ :** డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ నెల్లూరు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్రిస్మస్ పర్వదినం పరిష్కరించుకొని నాటు సారా తయారీ రవాణా అమ్మకాలు, ఇతర ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరముల నియంత్రణ కొరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెంట్ నెల్లూరు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెంట్ అండ్ ఫోర్స్ మెంట్ వింగ్ నెల్లూరు వారి ఆధ్వర్యంలో సంయుక్తంగా కలిసి జిల్లాలోని పలు ప్రాంతాలలో రైడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం బోగోలు మండలంలోని కప్పరాల తిప్ప, బోగోలు, చెంచులక్ష్మి పురం, నాగులవరం, సోమేశ్వరపురం గ్రామాలలో విస్తృత దాడులను నిర్వహించారు. ఈ దాడులలో ఎటువంటి ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరములు కనుగొనలేదు. గ్రామాలలోని ప్రజలకు మత్తు పదార్థాలు మద్యపానం సేవించడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నాటు సారా తయారీ మరియు విక్రయాలు ఇతర మత్తు పదార్థాల గురించి ఎవరైనా అమ్మకాలు సాగిస్తే సమాచారాన్ని వెంటనే ఉన్నతాధికారులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జె.రమేష్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెంట్ నెల్లూరు, జగదీష్ రెడ్డి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెంట్, ఎక్స్ఫరిమెంట్ వింగ్ నెల్లూరు, కావలి ఎస్ఐ ఎం దేవిక, బుచ్చిరెడ్డిపాలెం ఇన్‌చార్జ్ సీఐ జలీల్ ఖాన్, కోవూరు ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టణ ప్రజానీకానికి మెరుగైన సౌకర్యాలు కల్పించడమే నా లక్ష్యం



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చి ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి బుచ్చి పట్టణంలోని రాఘవరెడ్డి కాలనీలో కలుషిత నీళ్లు వస్తున్నాయని మీడియాలో వచ్చిన వార్త కథనంపై ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి తక్షణమే స్పందించారు. రాఘవరెడ్డి కాలనీ ప్రాంతాన్ని సందర్శించి కలుషిత నీళ్ళ సమస్య గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వాటర్ వర్క్స్ సిబ్బందిని పిలిపించి కలుషిత నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలంటూ ఆమె ఆదేశించారు అనంతరం అక్కడ నివాసం ఉంటున్న స్థానికులకు ఓటర్ సమస్యను తక్షణమే అరికడతామని హామీ ఇచ్చారు. అనంతరం ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి మాట్లాడుతూ.. ఇళ్లల్లోని వ్యర్థాలు, చెత్త డ్రైనేజీ కాలువలలో వేయ వద్దని విజ్ఞప్తి చేశారు. మురుగు కాలువలలో చెత్త వేయడం వలన డ్రైనేజీ వాటర్ ప్రవాహానికి ఆటంకం ఏర్పడి కాలువలలో నీళ్లు నిలిచిన కారణంగా దోమలు సమస్య తెలెత్తు తుందన్నారు. ఇళ్ల వద్దకు చెత్త సేకరణకు వచ్చే శానిటేషన్ సిబ్బందితో సహకరించి పరిసరాలను పరిశుభ్రంగా వుంచేందుకు తోడ్పడాలని కోరారు. నగర పంచాయతీ పరిధిలో ఏ సమస్య వున్నా తన దృష్టికి తేవాలని బుచ్చి పట్టణ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ఛైర్ పర్సన్‌గా తన లక్ష్యమన్నారు. పట్టణ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ప్రజానీకానికి మున్సిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి పిలుపు నిచ్చారు.

## అయ్యప్ప గుడిలో మండల పూజలు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** స్థానిక వేదయపాలెంలో వేంచేసియున్న వేద శాస్త్ర స్వామిఅయ్యప్ప స్వామి దేవస్థానంలో అయ్యప్పస్వామి వారికి కేరళ సాంప్రదాయ కార్తీకమాస మండల పూజలు మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం పాలాభిషేకం, మహాగణపతి హోమం, ఉష పూజ, నవకాభిషేకం, ఉచ్చపూజ, శ్రీ వేలి ఉత్సవం, సాయంత్రం మహా దీపారాధన, భగవతి సేవా, అత్తాళ్ళ పూజ, శ్రీ వేలీ ఉత్సవం, పడి కర్పూరం, హరివరాసనం, కార్యక్రమాలు కేరళ తంత్రులచే ఘనంగా జరిగాయి. మండల పూజలుకు కట్టా చంద్రశేఖర్ రెడ్డి లక్ష్మి దంపతులు మధ్యాహ్నం అన్నదానం ఉభయకర్తలుగా బాలకవి శరత్ బాబు పద్మలలిత దంపతులు నూతలపాటి రవికుమార్ ఇందిరా దంపతులు అయ్యప్ప స్వామి భక్తులకు రాత్రి బిక్ష కార్యక్రమంకు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గద్దం రత్నయ్య, కత్తి మోహన్ రావు, గద్దం విజయకుమార్, పావలా ప్రసాదు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు ఆట, విద్యా వస్తువులు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న సక్షం పథకంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాలకు ఆట, విద్యా సామాగ్రిని ఉదయగిరి చెక్కసగిషీ కేంద్రం నుంచి సరఫరా చేయనున్నట్లు కేంద్రం నిర్వాహకుడు షేక్ జాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్, ఐసీడీఎస్ పీడీల ఆదేశానుసారం చెక్కసగిషీ కేంద్రంలో మహిళా కళాకారులు తయారు చేసిన సుమారు రూ.15లక్షల విలువైన ఆట, విద్యా సామాగ్రిని జిల్లాలోని 401 అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేయనున్నామన్నారు. జిల్లాలో పలు అంగన్వాడీ కేంద్రాలకు ఈ సామాగ్రిని పంపిణీ చేశామన్నారు. సామాగ్రి తయారీ ఆర్డర్‌ను తమ కేంద్రానికి ఇచ్చినందుకు కలెక్టర్, ఐసీడీఎస్ పీడీలకు కృతజ్ఞతలు తెలిపారు.

## రెవెన్యూ సదస్సులో 25 అర్జీలు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** పిడతపోలూరు గ్రామ సచివాలయం వద్ద మంగళవారం రెవిన్యూ సదస్సు జరిగింది. భూముల సమస్యలపై రైతులు 25 అర్జీలు అధికారులకు ఇచ్చారు. సర్వే డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాసులు, భూమి కొలతలు శాఖ అధికారి అను రూప్ రైతులు ఇచ్చిన అర్జీలు చూసుకొని సమాధానం చెప్పారు. తదుపరి ఈ అర్జీలు ఆన్లైన్ కావడం జరిగింది. గతంలో నిర్వహించిన రీ సర్వేలో అవకతవకలు జరిగినట్లు రైతులు ఫిర్యాదు చేశారు. ఇక్కడ పనిచేసిన సచివాలయం సర్వేయర్ ఇష్టానుసారంగా పనిచేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అధికార పార్టీ నాయకులు దండు శ్రీనివాసులు, పెంచలయ్య, కొండారెడ్డి, కరిముల్లా రైతులు తదితరులు పాల్గొన్నారు.